క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

హుజూరాబాద్: హుజూరాబాద్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్ పట్టణం, బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సైదాపూర్: వెన్కెపల్లి, ఆకునూర్ విద్యుత్ సబ్ స్టేషన్‌ల ఫీడర్ల నుంచి శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ ఆంజనేయులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మరమ్మతు పనులు నిర్వహిస్తున్నందున రెండు గంటల పాటు అంతరాయం ఉంటుందన్నారు.

కమిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి ఇందిరానగర్ గ్రామంలో గంగిరెద్దుల కమిటీ హాల్ నిర్మాణ పనులను మాజీ సర్పంచ్ కొడిగూటి శారదప్రవీణ్ శుక్రవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. రాష్ట్రంలో ఏ గ్రామంలో లేని విధంగా శాలపల్లి గ్రామంలోనే మొట్టమొదటిసారిగా గంగిరెద్దుల కమిటీ హాల్‌ను నిర్మిస్తున్నామని అన్నారు. గంగిరెద్దు కులస్తులు మాజీ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాజాపల్లి గ్రామానికి చెందిన శనిగరపు వైష్ణవి సీనియర్ ఉమెన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 25న వనపర్తిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్ కీపర్‌గా రాణించినందుకు ఈ నెల 13 నుంచి 23 వరకు పూణేలో నిర్వహించే సీనియర్ ఉమెన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేశారని వెల్లడించారు. ఈసందర్భంగా హాకీ క్లబ్ నాయకులు సర్దార్ రవీందర్‌సింగ్, సర్దార్ సురేందర్‌సింగ్, బండ శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, గనిశెట్టి మహేశ్వర్ వైష్ణవిని అభినందించారు.

బాధ్యతలు స్వీకరణ

గంగాధర: గంగాధర ఎస్సైగా కిరణ్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై వుల్ల అభిలాశ్ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. కిరణ్‌రెడ్డికి సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

వీణవంక: వీణవంక ఎస్సైగా తోట తిరుపతి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వంశీకృష్ణ కరీంనగర్ స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీపై వెళ్లారు. ఆరునెలల్లోనే మంచి ఆఫీసర్‌గా వంశీకృష్ణ గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం తోట తిరుపతి మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. గ్రామాలలో అనుమానితులు సంచరిస్తే డయల్ 100కి సమాచారం అందించాలని సూచించారు.

నియామకం


ఉత్తర్వులు అందుకుంటున్న రేవంత్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్‌కు చెందిన పంజాల రేవంత్‌ను బీసీ రాజకీయ పోరాట సమితి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్‌కుమార్ శుక్రవారం నియామక ఉత్తర్వులు అందించారు. రేవంత్ మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం ఉద్యమిస్తానని, తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర నాయకులకు, నియామకానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఏలియా


పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం

జమ్మికుంట: జమ్మికుంట మండల పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కుర్రి ఏలియా ఎన్నికయ్యారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపల్లిలో సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా పాస్టర్ మైస స్వామిదాస్, జనరల్ సెక్రెటరీగా ఆనందకుమార్, జాయింట్ సెక్రెటరీగా ఎల్.టొటస్, ఆర్గనైజర్ సెక్రెటరీగా మోరె నేహెమ్యా, ట్రెజరర్‌గా స్వామ్యేల్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల పాస్టర్స్ పాల్గొన్నారు.

హరహర మహాదేవ

సాక్షి నెట్‌వర్క్: మహాశివరాత్రి సందర్భంగా చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని శివాలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. శివపార్వతులను దర్శించుకునేందుకు వేకువజాము నుంచి బారులుతీరారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. శివపార్వతుల కల్యాణం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చన, అభిషేకాలు, స్వామివారికి ఇష్టమైన గోగుపూలు, బిల్వపత్రాలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో కరువు, కాటకాలు రాకుండా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మహాదేవుడిని కోరుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సైదాపూర్ మండలం ఎగ్లాస్‌పూర్ నిరంజన్‌స్వామి ఆలయంలో కోడె మొక్కు చెల్లించారు. ఇల్లందకుంట శ్రీసీతారాముల దేవస్థానంలో శివపార్వతుల కల్యాణంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎంపీపీ పావని వెంకటేష్,జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు. పరమశివుడి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మనకొండూర్ మండలం లింగాపూర్‌లోని లింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా కనీస వసతులు లేక ఇబ్బందులు పడ్డారు. స్వామివారిని దర్శించుకున్నవారిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


సైదాపూర్: ఎగ్లాస్‌పూర్ నిరంజన్‌స్వామి ఆలయంలో కోడె మొక్కు తీర్చుకుంటున్న మంత్రి పొన్నం


శంకరపట్నం: కన్నాపూర్‌లో వైభవంగా శివపార్వతుల కల్యాణం


శంకరపట్నం: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి గుట్టపై భక్తులు


తిమ్మాపూర్: మృత్యుంజయ ఆలయంలో క్యూలో నిల్చున్న భక్తులు


మానకొండూర్: ఈదులగట్టెపల్లిలో శివునికి మొక్కుతున్న భక్తులు


మానకొండూర్: లింగేశ్వరాలయంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్ పూజలు


తిమ్మాపూర్: ఎల్ఎండీకాలనీలోని గిరిజా మృత్యుంజయ ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మణ్‌రావు, భక్తులు


జమ్మికుంట: శివాలయంలో దర్శనం కోసం భక్తుల క్యూ


ఇల్లందకుంట: కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే పాడి ,నాయకులు,భక్తులు


గంగాధర: కొండన్నపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యం


చొప్పదండి: శివకేశవాలయంలో పూజలు


మానకొండూర్: ఈదులగట్టెపల్లి గ్రామంలో శివపార్వతుల కల్యాణం


రామడుగులో వేకువజామున ఆలయానికి తరలివచ్చిన భక్తులు


తిమ్మాపూర్: పూజలు చేస్తున్న ఎల్ఎమ్‌డీ ఎస్సై చేరాలు దంపతులు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


హుజూరాబాద్: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పుర వీధుల్లో ర్యాలీ తీశారు. ఈసందర్భంగా జమ్మికుంట కేంద్రం మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ... మహిళలు, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళ సాధికారత కాగితాలకే పరిమితం కాకుండా చూడాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు అనువైన పరిస్థితులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాల వికాస కోఆర్డినేటర్లు సుమలత, స్వాతి, సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పేరెంట్స్ కమిటీ చైర్మన్ దూడ పాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు, విద్యార్థుల తల్లులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్ లావణ్య, చేయుత ఫౌండేషన్ కార్యదర్శి అబేద బాను, కోశాధికారి శిరీష, వైస్ ప్రిన్సిపల్ నవీన్, ఉపాధ్యాయులు రవి, లలిత, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.


జమ్మికుంట: నినాదాలు చేస్తున్న బాలవికాస సంస్థ సభ్యులు, మహిళలు

హుజూరాబాద్: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ... మహిళలు పురుషులతో సమానంగా ఎదగాలని, ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు వేముల పుష్పలత, సొల్లు సునీత, ప్రభావతి, ప్రియాకం, సుబితా రాణి, దుబాసి బాబు తదితరులు ఉన్నారు.

సమాజసేవ చేయడం అదృష్టం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: సమాజానికి సేవ చేయడం అదృష్టంగా భావించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సూచించారు. వాగేశ్వరీ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని అన్నారం, రంగపేట గ్రామాలలో ఎన్ఎస్ఎస్ శిబిరం వారం రోజులుగా కొనసాగుతోంది. శుక్రవారం అన్నారంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని వలంటీర్లు మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని, భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దసాని సులోచన, ఎంపీటీసీ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ బొట్ల కిషన్, మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రచారీ, బండెల మహేందర్, ప్రోగ్రాం ఆఫీసర్ వాగేశ్వరీ పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలి

గన్నేరువరం: గన్నేరువరం మండల ప్రజల కోసం కొమ్మెర రవీందర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్ సేవలను ప్రవేశపెట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే కవ్వంపల్లి అన్నారు. అంబులెన్స్‌కు శుక్రవారం గుండ్లపల్లి స్టేజీ వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. అత్యవసర సమయంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొమ్మెర రవీందర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, ఎస్సీ, కిసాన్, మీసీ సెల్ మండల అధ్యక్షుడు అనిల్, చంద్రారెడ్డి, మల్లేశం, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉచిత అంబులెన్స్ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరస్వామిగౌడ్, తదితరులు

జమ్మికుంట: ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బొమ్మకల్ వీ కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించే తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామిగౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని తనుగుల గ్రామంలో శుక్రవారం గౌడ సంఘం గీతకార్మికులతో కలిసి సమావేశం నిర్వహించారు. గౌడ కులస్తుల నుంచి పొన్నం ప్రభాకర్‌కు మరింత అండగా ఉంటే గౌడ సంఘాలు, బీసీలు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్‌గౌడ్, రాజయ్యగౌడ్, పోశాల శ్రీనివాస్‌గౌడ్, చంద్రమొగిలి గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గీత కార్మికులు పాల్గొన్నారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసిన సమ్మిరెడ్డి


స్పీకర్‌ను సన్మానిస్తున్న తుమ్మేటి సమ్మిరెడ్డి

జమ్మికుంట: రాష్ట్ర శాసనసభ అధిపతి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. వెంట కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

'యాదవులకు సంబంధంలేదు'

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 68లోని భూమికి యాదవకులస్తులకు ఎలాంటి సంబంధం లేదని గుడికందుల ఎల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు యాదవ సంఘం నాయకులు రాజకీయ లబ్ధి కోసం దేవుడు పేరు చెప్పి పట్టాభూమి ఆక్రమించడం కోసం ప్రయత్నం చేస్తున్నారని, ఒకవేళ దానికి సంబంధించి ఆధారాలు ఉంటే చూపించాలని తెలిపారు.

- **అన్నదానం**

కరీంనగర్‌రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం బొమ్మకల్‌లోని ఇటుకబట్టీ కార్మికులకు లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. క్లబ్ ప్రతినిధులు మంద వెంకటరమణారెడ్డి, చింతల కిషన్ పటేల్, గూడ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.